సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 24 । మార్చి । 2024



ప్రమాదకరంగా స్తంభాలు

రామన్నపేటలో రోడ్డు విస్తరణ చేసి, విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. - 9లో



పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంటమాలజీ హైదరాబాద్ జోనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సూచించారు. - 10లో



న్యూస్‌రీల్

టెన్త్ గణితం పరీక్షకు 9,233 మంది హాజరు

భువనగిరి : పదో తరగతి గణిత శాస్త్రం పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో 9,263 మంది విద్యార్థులకు గాను 9,233 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. 39 కేంద్రాలను డీఈఓ, తహసీల్దార్లు, ఇతర అధికారులు తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



ఆత్మకూర్(ఎం)లోని పరీక్ష కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగే శనివారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట చీఫ్ సూపరింటెండెంట్ రఘువర్ధన్‌రెడ్డి, డిపార్ట్‌మెంట్ అధికారి ఉన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం



మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

భువనగిరి రూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్పొరేట్ కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎండీ జహంగీర్ విమర్శించారు. శనివారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో పల్లెర్ల అంజయ్య అధ్యక్షతన జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ దేశ సంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజ్, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, వీరవెల్లి ముత్యాలు, ఏదునూరి మల్లేశం, కొండా అశోక్, సిలివేరు ఎల్లయ్య, పాండాల మైసయ్య, అబ్దుల్లాపురం వెంకటేశ్, ఎల్లంల వెంకటేశ్, మోటె ఎల్లయ్య, ఉడుత విష్ణు పాల్గొన్నారు.

గుట్టలో యూనిఫాం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కృష్ణన్

యాదగిరిగుట్ట రూరల్ : ప్రభుత్వ విద్యార్థుల యూనిఫామ్ కుట్టడానికి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చేందుకు యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని శనివారం డీఆర్‌డీఓ కృష్ణన్ సందర్శించారు. ఏ గ్రామంలోని విద్యార్థులకు అదే గ్రామంలో టైలర్ల ద్వారా కుట్టించి పాఠశాలలకు అప్పగించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించినట్లు తెలిపారు. దీనిలో భాగంగానే కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణను టైలర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట ఏపీఎం సుధాకర్, రమణ ఉన్నారు.

వేసవిలో మొక్కలు జాగ్రత్త



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్‌కుమార్

గుండాల : నర్సరీల్లో మొక్కల సంరక్షణకు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం గుండాల, రామారం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీరందించాలని పేర్కొన్నారు. అలాగే గుండాల మండల కేంద్రంలో జరుగుతునన ఉపాధి పనులు ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి కూలి ఎంత గిట్టుబాటు అవుతుందని ఆరా తీశారు. ఆయన వెంట ఏపీఓ ఇమ్మాన్యుయల్, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక ప్రధానాలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తర పూజలు నిర్వహించి సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు

ఒకటి ఓసీకి.. మరొకటి బీసీకి

బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఖరారు

నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డి, భువనగిరికి క్యామ మల్లేష్

- రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్
- సరైన అభ్యర్థుల కోసం సుదీర్ఘ చర్చలు, సమాలోచనలు
- కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర
- సామాజికవర్గాల వారీగా ఎంపిక
- భువనగిరి టికెట్ మూడోసారి కూడా బీసీలకే..



పేరు: కంచర్ల కృష్ణారెడ్డి
తండ్రి: కంచర్ల మల్లారెడ్డి
భార్య: సులోచన
కుమారుడు: సమరసింహారెడ్డి
పుట్టిన తేదీ: 10.5.1970
గ్రామం: ఉరుమడ్ల, చిట్యాల మండలం
విద్యార్హత: ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
వృత్తి: అడ్వకేట్ (1995– 2006)
రాజకీయం : బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక అనంతరం హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, మునుగోడు, నల్లగొండ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు



పేరు : క్యామ మల్లేష్
పుట్టిన తేదీ : 05.01.1965
చదువు : గ్రాడ్యుయేషన్
కుటుంబం : భార్య జంగమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు
స్వగ్రామం : శేరిగూడ, ఇబ్రహీంపట్నం మండలం, రంగారెడ్డి జిల్లా
రాజకీయం : 1992 నుంచి 1994 వరకు ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, 2013 నుంచి 2018 వరకు రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, 2019 నుంచి బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, సాక్షి యాదాద్రి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. నల్లగొండకు కంచర్ల కృష్ణారెడ్డిని, భువనగిరికి క్యామ మల్లేష్‌ను ఎంపిక చేసింది. ఈ మేరకు కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. నల్లగొండలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు గుత్తా అమిత్‌రెడ్డి ముందు ఉత్సాహం చూపినా.. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆయన పోటీ చేయనని అధిష్టానానికి తెలియజేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డిని బరిలో నిలపాలని పార్టీ భావించినా ఆయన బీజేపీకి టచ్‌లోకి వెళ్లినట్లు ప్రచారం జరగడంతో కంచర్ల కృష్ణారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. అయితే తాను బీజేపీలోకి వెళ్లడం లేదని, బీఆర్‌ఎస్‌లోనే ఉంటానని, ఎంపీగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నానని చిన్నపరెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. కానీ, శనివారం నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి విషయమై నేతలతో చర్చించి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డిని అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అధిష్టానం ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించే వరకు ఆగితే ప్రచారానికి ఇబ్బంది అవుతుందని, క్షేత్ర స్థాయిలో ప్రచారం ముమ్మరంగా చేయాలంటే వెంటనే అభ్యర్థులను ప్రకటించాలని జిల్లా నేతలు పట్టుబట్టారు. దీంతో శనివారం అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది.

భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేష్

నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని ఓసీకి ఇచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ.. భువనగిరి స్థానాన్ని బీసీ సామాజిక వర్గానికి(కురుమ) చెందిన క్యామ మల్లేష్‌కు కేటాయించింది. భువనగిరి టికెట్ విషయంలో కూడా పార్టీ తర్జనభర్జన పడింది. క్యామ మల్లేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను పరిశీలించింది. పైళ్ల శేఖర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరిగింది. అయితే, బీసీ వర్గానికి ఇవ్వాలని భావించిన పార్టీ.. క్యామ మల్లేష్, బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను పరిశీలించింది. చివరకు క్యామ మల్లేష్ పేరును ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలకు గాను రెండు చోట్ల అభ్యర్థులను ప్రకటించడంతో ఇన్నాళ్లుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

మొదటి నుంచి బీసీలకే..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ టికెట్‌ను బీసీలకే కేటాయిస్తోంది. ఈ నియోజకవర్గం నుంచి 2014, 2019లో ఎంపీ టికెట్ బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ ఇచ్చారు. 2014లో గెలిచిన ఆయన 2019లో ఓడిపోయారు. ఈ సారి కూడా బీసీ సామాజికవర్గానికి చెందిన క్యామ మల్లేష్‌కు ఇచ్చింది. క్యామ మల్లేష్ 2014లో ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం టికెట్ ఇవ్వకపోవడంతో 2019లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

భిక్షమయ్యగౌడ్, బాలకృష్ణారెడ్డికి నిరాశ

భువనగిరి ఎంపీ టికెట్ దాదాపు ఖరారు అయినట్లు భావించిన మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌కు అధిష్టానం మొండిచేయి చూపింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బూర నర్సయ్యగౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడడంతో బీజేపీలో ఉన్న భిక్షమయ్యగౌడ్‌ను బీఆర్‌ఎస్ పార్టీ ఆహ్వానించింది. ఆ సందర్భంగా అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు భిక్షమయ్యగౌడ్‌కు పదవుల హామీ ఇచ్చారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డికి కూడా నిరాశే ఎదురైంది. టికెట్ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు బాలకృష్ణారెడ్డిని కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్న సమయంలో ఎంపీ టికెట్ ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని ఇటీవల జిట్టా ప్రకటించారు. కానీ, ఆయనకు టికెట్ దక్కలేదు.



భువనగిరిలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

ఇళ్లు.. ఇంకెప్పుడిస్తరు?

- సింగన్నగూడెంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఆందోళన
- ఏడాది క్రితమే డ్రా ద్వారా ఎంపిక చేసిన అధికారులు
- నేటికీ అప్పగించకుండా జాప్యం

భువనగిరిటౌన్ : పేదోడి సొంతింటి కల సాకారం కావడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గూడుకోసం ఎదురుచూస్తూనే ఉన్నాడు. పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయకపోగా.. కేటాయించిన చోట లబ్ధిదారులకు స్వాధీనం చేయకపోవడంతో అవి బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయి. భువనగిరిలోని సింగన్నగూడెంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఏడాది క్రితం లబ్ధిదారులను ఎంపిక చేసినా నేటికీ స్వాధీనం చేయకపోవడంతో శనివారం వారు ఇళ్ల వద్ద ఆందోళనకు దిగారు.

444 ఇళ్ల నిర్మాణం

భువనగిరి పట్టణ పరిధిలోని సింగన్నగూడెంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 444 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు.ఇళ్ల పంపిణీకి గత ఫిబ్రవరిలో అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 4,315 మంది దరఖాస్తు చేసుకోగా వాటిని అధికారులు పరిశీలించి 1,950 మందిని అర్హులుగా తేల్చారు. అందులో 444 మందిని 2023 మార్చి 20వ తేదీన కలెక్టరేట్‌లో డ్రా తీసి ఎంపిక చేశారు. ఏడాది గడిచినా లబ్ధిదారులు ఇళ్లు స్వాధీనం చేయలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడిచినా ఇళ్ల విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు ఈనెల 18న, 23వ తేదీన స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి ఇళ్లు స్వాధీనం చేయాలని కోరారు.

సౌకర్యాలు సమకూర్చలేదు

డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించినా వసతులు కల్పించడంలో అప్పటి ప్రభుత్వం విఫలమైంది. మంచినీరు, డ్రెయినేజీలు, విద్యుత్ తదితర సౌకర్యాల కోసం రూ.2కోట్ల అంచనా వ్యయంతో అప్పటి అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. కానీ, నేటికీ సౌకర్యాలు సమకూరకపోవడం, ఇళ్లను స్వాధీనం చేయకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఇళ్లను చూపకపోతే తామే స్వాధీనం చేసుకుంటామని అంటున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్న



లాటరీ పద్ధతిలో నాకు డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చింది. ఇల్లు కేటాయించి ఈ నెల 29వ తేదీతో ఏడాది పూర్తవుతుంది. నేటికీ ఇల్లు స్వాధీనం చేయకపోవగా వసతులు కూడా కల్పించలేదు. లబ్ధిదారులకు ఇళ్లు అప్పగిస్తే తామే స్వయంగా ఖర్చులు భరించి వసతులు సమకూర్చుకుంటాం. ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉంటున్నా.

–ఆరె సునీల్‌కుమార్, లబ్ధిదారుడు

తాగునీటి సమస్య ఉత్పన్నం కావద్దు

- జెడ్పీ సీఈఓ శోభారాణి

బీబీనగర్ : వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకొని సమస్యను అధిగమించాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె బీబీనగర్ ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై తాగునీటిపై సమీక్షించారు. నీరు వృథా కాకుండా చూడాలన్నారు. పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. నీటి సరఫరాలోనూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించాలని, అవసరమైతే ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకొని నీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. అదే విధంగా ఎన్నికల కోడ్ అమలు, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నడుచుకోవాలని సూచించారు. అంతకు ముందు రహీంఖాన్‌గూడెం గ్రామాన్ని సందర్శించి నీటి ట్యాంక్‌ను పరిశీలించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. జెడ్పీసీఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా వచ్చిన ఆమెను అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఏఈ నర్సింహారెడ్డి, సూపరింటెండెంట్ హరిశివకుమార్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

భక్తులతో మాట్లాడి.. సమస్యలు తెలుసుకొని



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులతో మాట్లాడుతున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ భాస్కర్‌రావు చొరవచూపుతున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రధానాలయ ముఖమండపంలో క్యూలైన్లలో వెళ్తున్న భక్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా, దర్శనం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.పారిశుద్ధ్యం, తాగునీరు, టాయిలెట్ల సమస్య, వేసవిలో కొండపైన చేయవలసిన ఏర్పాట్లపై భక్తులు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

హమాలీల కూలి రేట్లు పెంపు

సాక్షి,యాదాద్రి : జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్‌లలో హమాలీ, దడవాయి, చాటావాలాల కూలి రేట్లు పెంచినట్లు అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్ షాలోమ్ తెలిపారు. శనివారం తన చాంబర్‌లో మార్కెటింగ్, సివిల్ సప్లై అధికారులు, మార్కెట్ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పెంచిన కూలీ రేట్లను ఆయన వెల్లడించారు. హమాలీలకు రూ.9నుంచి 14 రూపాయల 6 పైసలు, దడవాయిలకు రూ.3.60 నుంచి 5 రూపాయల 20 పైసలు, చాటావాలాలకు 2 రూపాయల 30 పైసల నుంచి 3 రూపాయల 71 పైసలకు పెంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు సూచించారు. కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, సివిల్ సప్లై జిల్లా మేనేజరు గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరెడ్డి, భువనగిరి మార్కెట్ చైర్మన్, మార్కెట్ కమిటీల కార్యదర్శులు పాల్గొన్నారు.



పెంచిన రేట్లను సమావేశంలో వెల్లడిస్తున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

మున్సిపాలిటీలకు ‘అమృత్’ యోగం

- తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు
- జిల్లాలో ఆరు మున్సిపాలిటీలకు నిధులు కేటాయించిన కేంద్రం
- కుళాయిల కనెక్షన్లు, ట్యాంకులు, నూతన పైపులైన్‌ల నిర్మాణం
- టెండర్లు పూర్తి, త్వరలో పనులు ప్రారంభం

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో తాగునీటి వ్యవస్థ పటిష్టం కానుంది. కేంద్రం అమృత్(అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫరేషన్) 2.0 పథకం కింద ఎంపిక చేసిన పట్టణాల్లో తాగునీటి పథకాలను విస్తరించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం భారీగా నిధులు ఖర్చు చేయనుంది. దీనిలో భాగంగా జిల్లాలోని భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు, భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, నూతన పైప్‌లైన్ల నిర్మాణం, కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నారు.

తాగునీటికి కటకట

మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే వివిధ కారణాల వల్ల పూర్తిస్థాయిలో నీరు రావడం లేదు. దీంతో స్థానిక బోర్ల నీటిని కలిపి సరఫరా చేస్తున్నారు. అది కూడా సమయపాలన లేకుండా సరఫరా జరుగుతోంది. శివారు ప్రాంతాలు, విలీన గ్రామాలకు నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. అమృత్ 2.0 పథకం ద్వారా కేంద్రం నిధులు కేటాయించడంతో మున్సిపాలిటీలే ట్యాంకులు నిర్మించి, పైప్‌లైన్లను విస్తరించి తాగునీటి వసతి కల్పించనున్నాయి. ట్యాంకుల నిర్మాణానికి మున్సిపాలిటీల్లో స్థలాలను కూడా ఎంపిక చేశారు. పనులకు గత మేనెలలోనే పాలనా ఆమోదం లభించినా ప్రారంభం కాలేదు. ఈనెలలో పనులు చేపట్టాలని ఇటీవల ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తవడంతో త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

నూతన మున్సిపాలిటీలకు ఊరట

కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు నిధుల లేమితో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చలేకపోతున్నాయి. పంచాయతీలుగా ఉన్నప్పుడు నీటి సరఫరా ఏవిధంగా ఇప్పుడూ అదే విధంగా ఉంది. ఫలితంగా వేసవిలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. జనాభాకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాల దృష్ట్యా తాగునీటి పథకాలు ఏర్పాటు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం 2.0 కింద నిధులు కేటాయించడంతో ఆయా పట్టణవాసులకు ఊరట కలగనుంది.



భువనగిరిలోని ప్రగతినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం

టెండర్లు పూర్తయ్యాయి

అమృత్ 2.0 పథకం కింద భువనగిరి మున్సిపాలిటీలో తాగునీటి వ్యవస్థ పటిష్టానికి చర్యలు తీసుకుంటున్నాం. నూతన పైపులైన్లు, ట్యాంకుల నిర్మాణంతో పాటు కుళాయిలకు కనెక్షన్ ఇవ్వడం జరుగుతుంది. టెండర్లు కూడా పూర్తయ్యాయి. పనులు ప్రారంభం కావల్సి ఉంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు వేస్తాం.

–కొండల్‌రావు, డీఈ, భువనగిరి మున్సిపాలిటీ

కేటాయించిన నిధులు ఇలా..

- భువనగిరి మున్సిపాలిటీకి రూ.21.80 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో మొత్తం 19 కిలో మీటర్ల మేర పైప్‌లైన్లు వేయనున్నారు.
- రాయగిరి, సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద, ప్రగతినగర్‌లో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించనున్నారు.
- భూదాన్‌పోచంపల్లికి రూ.17 కోట్లు మంజూరయ్యాయి. రెండు కిలో మీటర్ల మేర నూతన పైప్‌లైన్లు, రెండు ట్యాంకులు నిర్మించనున్నారు.
- మోత్కూరు మున్సిపాలిటీకి కేటాయించిన 12 కోట్ల రూపాయలతో 12 కిలో మీటర్ల దూరం పైపులైన్లు, మూడు ట్యాంకులు నిర్మాణం చేయనున్నారు.
- చౌటుప్పల్‌కు రూ.20 కోట్లు కేటాయించారు. 20 కిలో మీటర్ల మేర పైప్‌లైన్లు, మూడు ట్యాంకులు రానున్నాయి.
- యాదగిరిగుట్టకు రూ.38.64 కోట్లు మంజూరయ్యాయి.మూడు ట్యాంకులు, 18 కిలో మీటర్ల దూరం పైపులైన్‌లు వేయనున్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి

పెద్దవూర: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన నూకం అఖిల్ (17), పల్లవల కార్తీక్(17)లు బాల్య స్నేహితులు. వీరిద్దరు నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాశారు. వీరు శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై పెద్దవూరకు బయలుదేరారు. పెద్దవూర నుంచి నాయినివానికుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ నాగార్జునసాగర్ -హైదరాబాద్ ప్రధాన రహదారిపై నుంచి మండల కేంద్రం సమీపంలోని నాయినివానికుంట స్టేజీ వైపు డ్రైవర్ పోనిచ్చాడు. ఈ ప్రదేశంలో మూలమలుపు ఉండటం, అదే సమయంలో వీరి బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టడంతో రోడ్డుపై పడిపోయారు. దీంతో తలకు, ఛాతికి తీవ్ర గాయాలై నూకం అఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా, కార్తీక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108 వాహనంలో కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నల్లగొండ జిల్లా ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. కార్తీక్ మృతదేహానికి సాగర్ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

బస్సు లారీ ఢీ

- పలువురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన బస్సు





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సూర్యాపేట క్రైం : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాయినిగూడెం వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ రాయినిగూడెం వద్ద యూ టర్న్ తీసుకుంటోంది. ఈ క్రమంలో ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్న రాజధాని బస్సు వెనుక నుంచి లారీని ఢీకొట్టింది. డ్రైవర్‌తో సహా 11మంది ప్రయాణికులు బస్సులో ఉండగా ఖమ్మం పట్టణానికి చెందిన శంకర్, మున్నిసా, భరత్, చైతన్య, అభినందన్, డ్రైవర్ అప్పారావుతో పాటు మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటన స్థలాన్ని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్‌లు పరిశీలించారు.

కర్రతో కొట్టి.. బండరాయితో మోది

అల్లుడిని హత్య చేసిన మామ

- బండరాళ్లు కొట్టే ప్రాంతంలో కుటుంబ సభ్యుల మధ్య స్వల్ప ఘర్షణ
- పంచాయితీలో మాట్లాడుతుండగా క్షణికావేశంలో ఘాతుకం
- చింతపల్లి వెంకటంపేటలో దారుణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న దేవరకొండ డీఎస్పీ గిరిబాబు

చింతపల్లి : చింతపల్లి మండలం వెంకటంపేటలో దారుణం చోటు చేసుకుంది. క్షణికావేశంలో ఓ వ్యక్తి తన అల్లుడి తలపై కర్రతో కొట్టి ఆపై బండరాయితో మోది హత్య చేశాడు. ఈ ఘటనపై నాంపల్లి సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని వెంకటంపేట గ్రామానికి చెందిన సంపంగి ఎల్లయ్య, అతని కొడుకు సంపంగి కోటేష్, అల్లుడు ఆలకుంట్ల రాజు(38) బండరాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలోనే రోజూ మాదిరిగా రాళ్లు కొట్టేందుకు శుక్రవారం గ్రామ శివారులోని షేర్‌బండపైకి వెళ్లారు. బండ కొట్టుకునే విషయంలో ముగ్గురి మధ్య తగాదా చోటుచేసుకుంది.

పెద్ద మనుషుల్లో మాట్లాడుతుండగా..

ముగ్గురు సాయంత్రం గ్రామానికి చేరుకుని ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. రాత్రి బండ కొట్టుకునే విషయంలో జరిగిన తగాదాపై పెద్ద మనుషుల మాట్లాడుకోవాలని నిర్ణయించుకన్నారు. ఈ క్రమంలో గ్రామంలోని కొత్తగా నిర్మించిన పశువుల ఆస్పత్రి వద్ద ఇరు కటుంబాల వారు చేరుకుని మాట్లాడుకుంటున్నారు. ఈ తరుణంలో రాజు, కోటేష్ మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. దీంతో రాజు తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో కోటేష్‌పై దాడి చేశాడు. ఆ పక్కనే ఉన్న ఎల్లయ్య తీవ్ర ఆగ్రహానికి లోనై తన చేతిలో ఉన్న కర్రతో అల్లుడు రాజు తలపై బలంగా కొట్టారు. తీవ్ర రక్తస్రావంతో రాజు కిందపడిపోగా ఆ వెంటనే ఎల్లయ్య పక్కనే ఉన్న బండరాయిని అతడి తలపై ఎత్తేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు దారి తీసిన కారణాలను గ్రామస్తులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సేకరించారు. మృతుడికి కూతురు, ఇద్దరు కుమారులున్నారు. పోస్టుమర్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బ్లేడ్ దాడిలో గాయపడిన కోటేష్ దేవరకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రధాన నిందితుడు ఎల్లయ్య పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

3,500 కిలోల నల్లబెల్లం పట్టివేత

శాలిగౌరారం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ట్రక్కులో అక్రమంగా తరలిస్తున్న 3500 కిలోల నల్లబెల్లం(70 బస్తాలు) పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం రాత్రి వెల్లడించారు. శాలిగౌరారం మండలంలోని 365వ నంబర్ జాతీయ రహదారిపై సాయంత్రం పోలీసులు వాహనాల తనఖీ చేపట్టారు. ఈ క్రమంలో చిత్తూరు పట్టణానికి చెందిన భరత్‌నాయుడు, ఉదయ్‌కుమార్‌లు నల్లబెల్లం రవాణా చేస్తున్న వాహనం పట్టుబడినట్లు ఎస్ఐ తెలిపారు. బెల్లం రవాణాకు సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పట్టుకొని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

పార్లమెంట్ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి శాలిగౌరారం మండలం చిత్తలూరుగ్రామంలో బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో బెల్టు దుకాణం నడుపుతున్న ఎర్ర విజయ్‌కుమార్ ఇంట్లో సోదాలు చేయగా 12 బీర్లు లభ్యమయ్యాయని ఎస్ఐ తెలిపారు.అనుమతులు లేకుండా బెల్టు దుకాణం నడుపుతున్న విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వరికొయ్యలకు నిప్పు.. తప్పిన ప్రమాదం

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తులు వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో ఆ పక్కనే ఉన్న జమాయిల్ తోటకు మంటలు వ్యాపించాయి. ఈ ఘటన తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెంలో శనివారం జరిగింది. రామలింగాలగూడెం శివారులో విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న కోసిన వరి పొలాల్లోని గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అక్కడ నుంచి మొదలైన మంటలు వరిగడ్డితో పాటు పక్కనే ఉన్న జమాయిల్ తోట అందులో ఉన్న ఇంటి వైపు వ్యాపించాయి. గమనించిన అన్నెపూరి సత్యనారాయణ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ ఎ.సత్యనారాయణరెడ్డి, లీడింగ్ ఫైర్‌మెన్ టి.నరహరి, సిబ్బంది టి.మధు, డి.శంకర్, ఏ.సదానందం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి కిందపడి కాంగ్రెస్ నాయకుడు మృతి

మునగాల(కోదాడ): ట్రాక్టర్ పైనుంచి కిందపడి కాంగ్రెస్ నాయకుడు మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం నారాయణగూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునగాల మండలంలోని నారాయణగూడేనికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లె రామిరెడ్డి(75) శనివారం గ్రామంలో చేపట్టిన సీసీరోడ్డు పనులను పరిశీలించడానికి ట్రాక్టర్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఒక్కసారిగా బీపీ డౌన్ కావడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు. ఈ క్రమంలో అతడి తల ట్రాక్టర్ టైర్ కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రామిరెడ్డి



రామిరెడ్డి(ఫైల్)

ఐదు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామిరెడ్డి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు గ్రామశాఖ నాయకుడు సారెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. దహనసంస్కారాలకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరుకానున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

రామాలయంలో చోరీ

చండూరు : గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. చండూరు మండలం ఉడతలపల్లిలోని రామాలయంలోకి శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించారు. ఆలయంలోని శఠగోపురం, మూడు జతల పుస్తెలతాడు అపహరించుకుపోయారు. శనివారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఓంకారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మద్దిరాల : అక్రమంగా నిల్వ ఉంచిన రెండు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల గ్రామానికి చెందిన ఆమంచి మహేష్ తన ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడి చేశారు. అతడి ఇంట్లో నిల్వ ఉన్న రెండు క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుదెస్ఐ మధునాయుడు తెలిపారు.



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

హోంగార్డు ఇంట్లో చోరీ

- 4.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్ శనివారం రాత్రి వెలుగుచూసింది. వన్ టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా పాలకీడు పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని తీసుకుని ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్స అనంతరం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తాళం పగుల కొట్టి ఉంది. చోరీ జరిగిందని గ్రహించి లోపలికి వెళ్లి చూడగా బీరువా కూడా తెరిచి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనలో 4.5 తులాల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

- వాహనాల తనిఖీలో పట్టుకున్న బీబీనగర్ పోలీసులు
- నలుగురిపై కేసు.. వివరాలు వెల్లడించిన డీసీపీ రాజేష్ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

బీబీనగర్: హైదరాబాద్ నుంచి వరంగల్‌కు తరలిస్తున్న పేలుడు పదార్థాలను శనివారం బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రాజేష్ చంద్ర కేసు వివరాలు వెల్లడించారు. నాగర్‌కర్నూలు జిల్లా మొలుగార గ్రామానికి చెందిన శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాని బయ్యపు హనుమంతు రెడ్డి తన వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న ఘట్‌కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పేదవీడు నర్సింహులును కొండాపూర్‌లోని శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ వద్ద లోడ్ ఉందని చెప్పి వాహనాన్ని పంపించాడు. అక్కడ శ్రీనివాస్ ఎంటర్ ప్రైజెస్ యాజమాని దేవేందర్ రెడ్డి చెప్పినట్లుగా మేనేజర్ దత్తురావు డ్రైవర్ నర్సింహులు ఆ వాహనంలో 6,925 కేజీల ఎక్స్‌ప్లోజీవ్ పదార్థాలను లోడ్ చేయించాడు. అనంతరం దత్తు ఇద్దరు యాజమానులు లోడ్ విషయంలో ఒకరికొకరు మాట్లాడుకున్నారని, దానికి సంబంధించిన వేబిల్లు ఇస్తున్నానని, ఈబిల్లు ఎక్కడా చూపించ వద్దని చెపప్పాడు. నీకు మరో వేబిల్లును సాల్వో ఎక్స్‌ప్లోజీవ్‌కు చెందిన అకౌంటెంట్ పరుశురాం పంపుతాడని, ఎవరైనా వాహనాన్ని అపితే అదే చూపించాలని నర్సింహులుకు చెప్పాడు. పరుశురాంలు తప్పుడు డ్యాకక్యుమెంట్ సృష్టించి డ్రైవర్‌కు వేబిల్లును పంపించాడు. ఆవేబిల్లుపైనే ఉన్న స్థలానికి ఎక్స్‌ప్లోజీవ్ పదార్థాలు చేరవేయాలని చెప్పాడు. ఘట్‌కేసర్ నుంచి నల్లగొండకి ఎక్స్‌ప్లోజీవ్‌లను తీసుకెళ్లనట్లుగా రికార్డులు చూపించి నాగర్‌కర్నూల్‌లోని శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమేశ్వర స్టోన్ క్రషర్‌కు రవణా చేస్తున్నట్లు మరొక తప్పుడు డ్యాక్యుమెంట్ సృష్టించి అక్రమ పేళుళ్లకు పాల్పడుతున్నారని డీసీపీ తెలిపారు. నల్లగొండ జిల్లాకు చెందిన మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్, జనగామ జిల్లాలోని సోమేశేఖర క్వారీతో సంబంధాలు ఉన్నాయని వీటి అన్నింటిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు. అక్రమ పేలుడు పదార్థాల రవాణాకు కారకులైన నాగర్‌కర్నూలు జిల్లా మొలుగారం గ్రామానికి చెందిన శ్రీసాయి హనుమాన్ ఎంటర్‌ప్రైజెస్ యాజమాని బయ్యపు హనుమంతరెడ్డి, ఘట్‌కేసర్ మండలం కొండాపురానికి చెందిన శ్రీనివాస ఎంటర్ ప్రైజెస్ యాజమాని దేవేందర్‌రెడ్డి, ఘట్‌కేసర్ మండలం కొండాపూర్‌కు చెందిన ఎక్స్‌ప్లోజీవ్ డీసీఎం వాహన డ్రైవర్ పెదవీడు నర్సింహులు, ఘట్‌కేసర్ మండలం అక్కిరెడ్డిపల్లికి చెందిన సాల్వో ఎక్స్‌ప్లోజీవ్ కంపెనీకి చెందిన అకౌంటెంట్ లింగాల పరుషరాములుపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు.

యాదాద్రిలో నల్లగొండ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పూజలు



యాదాద్రి కొండపై నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని నల్లగొండ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి శనివారం రాత్రి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభు, ప్రతిష్ఠా అలంకారమూర్తులతో పాటు ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే స్వామి వారిని దర్శించుకున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట నలగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఉన్నారు.

పదో తరగతి విద్యార్థుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న విద్యార్థులు

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలో శనివారం పదో తరగతి విద్యార్థులు ఘర్షణ పడ్డారు. గణితం పరీక్ష అనంతరం విద్యార్థులు ఇంటికి వెళ్లే తరుణంలో ఆటో ఎక్కే విషయంలో గొడవ జరిగింది. విద్యార్థులు స్థానిక ఎక్స్ రోడ్డు వద్ద రెండు వర్గాలుగా విడిపోయి తన్నులాటకు దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. స్థానికులు విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను చెదరగొట్టారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



భద్రయ్య(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతిచెందాడు. మిర్యాలగూడ ఆర్టీసీ డిపోలో వి.భద్రయ్య(56) 26 ఏళ్లగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భద్రయ్య సమీప బంధువుల వివాహం శుక్రవారం విజయవాడలో ఉండటంతో ఆర్టీసీ బస్సును బుక్ చేశారు. వేడుక పూర్తయిన తర్వాత ఆ బస్సుకు భద్రయ్య డ్రైవర్‌గా వెళ్లి శనివారం తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యలో కృష్ణాజిల్లా చిల్లకల్లు వద్దకు చేరుకోగానే ఛాతిలో నొప్పి వస్తుందని బస్సును పక్కకు నిలిపాడు. జగ్గయ్యపేటలోని ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య నలుగురు కూతుళ్లు ఉన్నారు. డిపో మేనేజర్ కోదాడ డిపో నుంచి డ్రైవర్‌ను పంపించి బస్సును తెప్పించారు. భద్రయ్య మృతదేహాన్ని సందర్శించి తక్షణ సాయంగా రూ.20వేలు అందజేశారు.ఆయన వెంట డిపో సీఐ భారతి ఉన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి

చండూరు : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడి గాయపడిన గీత కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాలకూరి మారయ్య (64) కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగా మారయ్య కల్లు తీసేందుకు ఈ నెల 20న గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

వలిగొండ : వ్యవసాయ బావుల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వలిగొండ మండలం నాగారం సమీపంలోని వ్యవసాయ బావి పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. అక్కడ భువనగిరి మండలం సురేపెల్లికి చెందిన వంగూరి కృష్ణ, నందనానికి చెందిన పైళ్ల అశోక్ రెడ్డి, తుమ్మలగూడేనికి చెందిన రాచకొండ పాండు, రవి, సంజీవ గోస్, వలిగొండకు చెందిన మునుకుంట్ల మల్లికార్జున్ పేకాట ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, రూ.5,200, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్యామ్ సుందర్‌రెడ్డి తెలిపారు.